ప్రభాకరం పెళ్ళిచేసుకున్నాట్ట!

నాలుగు నెలలు బిజినెస్ టూర్‌లో ఉండి ఊళ్ళోకి రాగానే తెలిసిన వార్త.

నాకా వార్త చాలా ఆసక్తి కలిగించింది.

ఎందుకంటే పెళ్ళి పేరు చెబితేచాలు ప్రభాకరం తెగ ఆదర్శాలు వల్లె వేసేవాడు.

కట్నం గిట్నం ఉండ కూడదనీ–

అట్టహాసాలూ ఆర్భాటాలూ అసలే కుదరదనీ-

ఆత్మసౌందర్యానికే తప్ప బాహ్యసౌందర్యానికి విలువ ఇవ్వననీ-

ఇలా ఇంకా ఏమేమో మాట్లాడేవాడు. మొదటి రెండూ చాలా మంది ఆచరణలో పెడుతున్నారు. వాటిని ప్రభాకరం అమలు చేస్తాడా లేదా అనే సందేహం నాకు లేదు.

వచ్చిన చిక్కల్లా ఆత్మసౌందర్యం విషయంలోనే.

నాకే కాదు ఎవరికైనా ఈ విషయంలో సందేహం కలిగిస్తుంది మరి.

అసలు ఆత్మసౌందర్యాన్ని పరికించటం ఎలా?

పెళ్ళి చూపుల తతంగం పేరుతో ఓ గంట

# అద్దం చూపని అందం

## జి.ఎన్. సూరి

సేపు జరిగే పార్సు వల్ల ఆత్మసౌందర్యం బయట పడుతుందా?

పోనీ ప్రేమించిన మనిషితో చేరువగా గడిపినంత మాత్రాన ఆత్మసౌందర్యం కనబడుతుందా?

నాకు మాత్రం నమ్మకం లేదు.

పెళ్ళికి పూర్వం ఆడా మగా కలసి–మెలిసి తిరగటం అంటూ జరిగే ఆ సమయం అంతా స్వీట్ నథింగ్స్ చెప్పుకునేందుకే సరిపోతుంది తప్ప ఆత్మసౌందర్యం అవలోకించటానికి సమయం ఏం చిక్కుతుంది?

అందులోను వయసు ఓ అందమైన వల: అది చేసే గారడీ చాలా గమ్మత్తైంది.

ఓ మాటు ప్రభాకరం కనిపిస్తే బాగుండు ననిపించింది.

చాలా ఆశ్చర్యంగా ఆరోజు మధ్యాహ్నమే అతను మా ఇంటికి వచ్చాడు. ఆ కబుర్లూ-ఈ కబుర్లూ అయ్యాక అతనే చెప్పాడు విషయం.

"చాలా చిత్రంగా జరిగిపోయిందిసార్ పెళ్ళి. మీలాంటి ఆప్తుల్ని పిలిచే వ్యవధి కూడా లేకపోయింది."

పెళ్ళి గురించి చెబుతూ అన్నాడతను.

"మిత్రానికి పెళ్ళి చేసుకున్నావ్! పిలవటానికేముందిలే" అన్నాను.

అయితే ఆ తర్వాత మనసులో పీకుతున్న సందేహాన్ని బయట పెట్టకుండా ఉండలేకపోయాను"

"సరే పెళ్ళంటూ చేసుకున్నావ్ .... మరి ఆ హడావిడిలో నీ ఆశయాలకి, ఆదర్శాలకు భంగం ఏం కలగలేదా?" అడిగాను.

సగటు మనిషి తత్త్వం! అవకాశం ఉంటే చిన్న రాయి విసరాలనే సరదా-

నా ప్రశ్నకు సమాధానంగా అతను నవ్వి ఊరుకున్నాడు.

రెండు నిమిషాల తర్వాత "మీరు మా ఇంటికి రావాలిసార్!" అన్నాడు.

నా సందేహానికి సమాధానం రాబట్టుకోవాలి మరి.

ఏమైనా నాకీ కుర్రకారు మీద నమ్మకం లేదు. పదిమందిలోను కూర్చున్నప్పుడు ఏదో హీరోయిజం ప్రదర్శించుకునేందుకు ఆదర్శాలూ-ఆశయాలు వల్లె వేస్తారనిపిస్తుంటుంది నాకు-

పెళ్ళి పేరుతో ఆడపిల్లల తల్లితండ్రులను పీల్చి పిప్పిచేయటం అమానుషం అంటూ రాడికల్ దృక్పథంతో కబుర్లుచెప్పేవాలామంది హీరోలు సమస్త లాంఛనాలూ జరుపుకోవటం నేను ఎన్నో సార్లు చూశాను.

తర్వాత ఆ విషయమై వాళ్ళని ఏదైనా అడిగితే "హి....హి" అంటూ వెకిలినవ్వు నవ్వేసి తప్పుకోటానికి చూసే వారు నాకు తెలుసు.

అలాంటి వాళ్ళంటే నాకు చాలా ఎలర్జీ!

"రండిసార్" అన్న ప్రభాకరం పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాను.

ప్రభాకరం వెనకే లోపలికి నడిచాను.

చాలా నీటుగా ఉందా గది.

ఇంటిని చూస్తే ఇల్లాలిని చూడక్కర్లేదంటారు. ఆ పరిశుభ్రతని పరిశీలిస్తూ ప్రభాకరం భార్య రూపాన్ని ఊహించుకోసాగాను.

"నమస్తే!" సన్నగా వినపడిందో స్వరం.

వెంటనే తేరుకున్నాను కాని, ఒక్కక్షణం మాత్రం ఉలిక్కిపడ్డాను.



వొళ్ళంతా కాలిన పుళ్ళతో కేవలం అంత చర్మం మాత్రమే మిగిలి భీతిగొలుపుతున్న ఆమెని ప్రభాకరం ఎలా పెళ్ళి చేసుకున్నాడా అనిపించింది.

క్షణకాలం చూసేందుకే గగుర్పాటు కలిగించే ఆమె రూపాన్ని జీవితాంతం భరించేందుకు ఎలా సిద్ధ పడగలిగాడతను?

అది త్యాగమా?

సానుభూతా?

నాకు సమాధానం దొరకలేదు.

"మనం అలా బయటకు వెళ్దాంసార్:" ప్రభాకరం అన్నాడు.



నాకూడా అక్కడ ఉండాలని అనిపించ లేదు. ప్రభాకరం, నేనూ రోడ్డు మీదకు వచ్చాం.

చాలా దూరం నడిచేదాకా నేనేం మాట్లాడ లేదు. కాదు-ఏం మాట్లాడాలో తోచటంలేదు.

నేను చాలా అయోమయావస్థలో ఉన్నాను

"ఆమె నా ఫ్రెండు శివరావు చెల్లెలు సార్!"

కొంతదూరం వెళ్ళాక ప్రభాకరం చెప్పాడు-ఉపోద్ఘాతంలా.

నేను అతని వైపు మౌనంగా చూశాను.

అతను నా మొహంలో కనబడుతున్న భావాన్ని అర్థం చేసుకున్నట్లు నవ్వి-

"నా ఆదర్శానికేం భంగం కలగలేదు సార్!" అన్నాడు.

మళ్ళీ అతనే మాట్లాడటం మొదలు పెట్టాడు. అతను చెప్పేది శ్రద్ధగా వినసాగాను.

ప్రభాకరం భార్య పద్మ చాలా అందమైంది సహజంగా! అంటే ఆ అగ్ని ప్రమాదం జరగటానికి పూర్వం.

ఒకరోజు వాళ్ళమ్మగారు వంట చేస్తుంటే కిరోసిన్ స్టౌ పేలిందట. దగ్గర్లో ఉన్న ఈ అమ్మాయి క్షణకాలం కూడా ఆలస్యం చేయకుండా తల్లిని రక్షించటానికి వంటగదంతా అలుముకున్న మంటల మధ్యకి వెళ్ళింది.

తల్లికి ఏమాత్రం ప్రమాదం జరక్కుండా చూడగలిగింది. కాని-తనే సకాలంలో బయట పడలేకపోయింది. ఆమె కట్టుకున్న పోలియస్టర్ చీర భగ్గు మంది.

శరీరం కుతకుతా ఉడికి పోయింది.

ప్రాణాపాయం తప్పి వికారమైన రూపంలో మిగిలిపోయింది.

ప్రభాకరం చెప్పింది విన్నాక నా మనసు ఎలాగో అయిపోయింది.

తల్లి క్షేమంకోసం కూతురు చేసిన మహత్తర త్యాగం.

నాకు కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి.

ఎంతో భవిష్యత్తు ముందుంచుకుని కన్నె తనపు కలలను కాస్త పక్కకు పెట్టి, నవమాసాలూ మోసి, కనిపెంచిన తల్లికోసం శారీరక సౌందర్యాన్ని పణంగా పెట్టడం కంటే ఆత్మసౌందర్యానికి అర్థం ఏముంటుంది!

అంతకు ముందు కొన్ని క్షణాల క్రితం చూసిన ప్రభాకరం భార్య వికారమైన రూపం తలుచుకుంటూంటే ఏమంత రోత కలగటంలేదు.

ఎర్రని కాలిన మచ్చల మాటున దాగిన ఆత్మసౌందర్యం నా మనసుకి ఇప్పుడు కనబడుతోంది. అది ఓ అద్భుతమైన జ్యోతిని. స్ఫురింప చేస్తోంది.

ఆ వెలుగులో ఆమె అంతస్సౌందర్యం స్పష్టంగా కనబడుతోంది.

"నా దృష్టిలో-జన్మనిచ్చిన తల్లిని ఆరాధించటం కంటే, ఆత్మసౌందర్యం చూపించే అద్దం ఈ లోకంలో లేదుసార్.

ఇప్పుడు చెప్పండి నా ఆదర్శాలకు ఏమైనా భంగం కలిగిందా!" ప్రభాకరం అడిగాడు.

నేను ప్రభాకరం భుజంమీద చేయివేశాను.

మనసులో పెల్లుబుకుతున్న ఆనందం మాటల్ని బయటికి రానీయకుండా చేస్తూంటే మౌనంగా, అభినందన పూర్వకంగా అతని భుజం తట్టాను. ఎదుటి వాళ్ళల్లో ఆత్మసౌందర్యాన్ని వెతకటమే కాదు తనలో కూడా అది ఉండేలా చేసుకున్నాడు అతను.

ప్రభాకరాన్ని చూస్తూంటే నాకు చాలా ఆనందంగా ఉంది.

అతను నాకు స్నేహితుడు అయినందుకు మాత్రమే కాదు.

తాళి కట్టిన మరుక్షణం నుంచి ఆడదాన్ని కట్నంకోసమో మరే కారణంచేతనో వేధించి అగ్నికి ఆహుతి చేస్తున్న మగవీరులు ఉన్న ఈ ప్రపంచంలోనే-

అగ్నిపాలయి వికారపు రూపు మిగుల్చుకున్న ఓ ఆడపిల్లలో ఉన్న ఆత్మసౌందర్యానికి విలువనిచ్చి జీవిత భాగస్వామినిగా చేసుకున్న ప్రభాకరం లాంటి మగాడు ఉన్నందుకు!



అభివృద్ధి

రేపటి నుంచి బడికి ఆలస్యంగా వచ్చిన వాళ్ళు-ఒక్కొక్కరు పది పైసలు ఈ డబ్బాలో వేయాలి. ఆ డబ్బుతో పాఠశాలను బాగుచేస్తాం- అన్నారు టీచర్.

అంతే! మర్నాటి నుంచి విద్యార్థులందరూ లేటుగా రాసాగారు-ఏవిధంగానయినా తమ బడి త్వరగా బాగు పడుతుందన్న ఉద్దేశంతో!

—జె. రాధాకృష్ణ (పొన్నూరు)

మయూరి పాఠకులకు నూతన సంవత్సరంలో వినూత్నకానుక



వీరభద్రరావ్ పమ్మి సృష్టిస్తున్న మిస్టరీ నవల "దక్షయజ్ఞం"